

**బడుల్లో వసతులు కల్పించాలి**
ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో పలుచోట్ల ఆందోళనలు నిర్వహించారు.

- 11లో ▸



**సేవల్లో నాణ్యత పాటించాలి**
రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు పావెంత్ సూచించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.1 /13.1

**వాతావరణం**
ఆకాశం పాక్షికంగా మేఘావృతం అవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది. చలి గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### యూనిఫామ్‌లు కుట్టడానికి కొటేషన్‌ల ఆహ్వానం

**కామారెడ్డి క్రైం:** జిల్లాలోని గాంధారి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో బాలుర, బాలికల యూనిఫామ్‌లు కుట్టేందుకు ఆసక్తి గల దర్జీల నుంచి సీల్డ్ కొటేషన్‌లు ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు, సంస్థలు వచ్చే నెల 3లోగా గాంధారి పాఠశాలలో సీల్డ్ కొటేషన్‌లు సమర్పించాలని సూచించారు. నిబంధనల ప్రకారం యూనిఫామ్‌లు కుట్టి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ద్వారా టెండర్ ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. టెండర్ ఫారాలకు గాంధారి పాఠశాల ప్రిన్సిపాల్ (9490957317)ను సంప్రదించాలని సూచించారు.

### బస్సులో మహిళా కండక్టర్‌కు అస్వస్థత



**కామారెడ్డి టౌన్:** కామారెడ్డి డిపోలో విధులు నిర్వహిస్తున్న మహిళా కండక్టర్ బస్సులో తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను తక్షణమే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి డిపోలో పని చేస్తున్న కండక్టర్ మహేశ్వరి కామారెడ్డి – కరీంనగర్ రూట్‌లో విధులు నిర్వహిస్తోంది. గురువారం బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఎక్కారు. బస్సు బస్టాండ్‌లో ఉండగానే ఆమె అస్వస్థతతో కింద పడిపోయారు. దీంతో ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అసిడిటీ కారణంగా ఆమె అస్వస్థతకు గురైనట్లు వైద్యులు తెలిపారు. ఊపిరాడక గుండెపోటుకు గురికావచ్చని ఆర్టీసీ సిబ్బంది మొదట భావించారు. మహేశ్వరి కోలుకోవడంతో అధికారులు, సిబ్బంది, ఆమె కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఆమెకు అసిడిటీ ఉందని, మందులు వేసుకోకపోవడంతో ఇలా జరిగిందని డిపో మేనేజర్ ఇందిరా తెలిపారు.

### కోర్టు ఆవరణలో ట్రాఫిక్ చలాన్ల చెల్లింపు కేంద్రం

**కామారెడ్డి క్రైం:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ట్రాఫిక్ చలాన్ల చెల్లింపు కేంద్రాన్ని ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌంటర్ ఈ నెల 30 వరకు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ట్రాఫిక్ చలాన్లకు రాయితీ ప్రకటించడంతో వాహనదారులు ఫైన్ కట్టడానికి ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### రూ. 50కి 'ప్రజాపాలన' దరఖాస్తు

**భీమ్‌గల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన' కార్యక్రమం గురువారం ప్రారంభం కాగా, భీమ్‌గల్‌లోని బాబానగర్ గ్రామంలో గందరగోళం నెలకొంది. జెడ్పీ సీఈవో గోవింద్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో క్యూలో నిలబడ్డ కొద్దిసేపటికే దరఖాస్తులు అయిపోవడంతో ప్రజలు ఆగ్రహానికి గురయ్యారు. కొంతమంది పంచాయతీ కార్యదర్శులు మాత్రం దరఖాస్తులను జిరాక్స్ తీసుకోవచ్చని ఉచిత సలహా ఇవ్వడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి చేసేదేమీ లేక జిరాక్స్ సెంటర్లలో ఒక్కో దరఖాస్తు రూ. 50కి కొనుగోలు చేశారు.

# వినతుల వెల్లువ!

- తొలిరోజు 21,914 దరఖాస్తులు
- పలుచోట్ల అప్లికేషన్ల కొరత.. ఆందోళన చేసిన ప్రజలు
- జిల్లాను చుట్టేసిన కలెక్టర్ పాటిల్
- జుక్కల్ ఎమ్మెల్యే మినహా మిగతావారు కార్యక్రమానికి దూరం..

**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా** చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి జిల్లాలో తొలిరోజు విశేష స్పందన లభించింది. అభయహస్తం పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు గ్రామసభలకు తరలివచ్చారు. కొన్నిచోట్ల దరఖాస్తుల కొరత ఉండడంతో ఆందోళనకు దిగారు. – సాక్షి, కామారెడ్డి



పిట్లంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



బీబీపేటలో దరఖాస్తుల కోసం గుమిగూడిన ప్రజలు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంకోసం కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రజాపాలన పేరుతో గ్రామసభలు నిర్వహిస్తోంది. గురువారం ప్రజా పాలన గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 54 సభలు నిర్వహించి, అభయహస్తం పథకాలకు దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి, సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివనగర్, గాంధారి, బిచ్కుంద, లింగంపేట, బాన్సువాడ, ఎల్లారెడ్డిలోని మూడో వార్డులో ప్రజా పాలనను పరిశీలించారు. మొదటిరోజు జిల్లావ్యాప్తంగా 21,914 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి 17,001, పట్టణ ప్రాంతాల్లో 4,913 దరఖాస్తులు వచ్చాయన్నారు.

**ఉదయం నుంచే బారులు...**

ప్రజాపాలన కోసం గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ ఉదయం నుంచే ప్రజలు బారులు తీరారు. 8 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేశారు. దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే సరఫరా చేయగా.. కొన్నిచోట్ల ప్రజలకు అందలేదు. దీంతో జిరాక్సు సెంటర్లకు వెళ్లి జిరాక్సు పత్రాలు నింపి అందజేశారు. అక్కడక్కడా ప్రజాప్రతినిధులు, నాయకులు దరఖాస్తు ఫారాలను తమకు అనుకూలమైన వారికి మాత్రమే ఇచ్చారన్న ఆరోపణలు వచ్చాయి. బిచ్కుంద మండల కేంద్రంలో దరఖాస్తు పత్రాలు అందకపోవడంతో గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

**దరఖాస్తు ఫారాలకు కొరత లేదు..**

ప్రజాపాలన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. దరఖాస్తు ఫారాలకు ఎలాంటి కొరత లేదు. అవసరమైనన్ని అందిస్తున్నాం. అన్ని గ్రామాల్లో సభలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– జితేష్ వి పాటిల్, కలెక్టర్

**జుక్కల్ ఎమ్మెల్యే ఒక్కరే...**

గ్రామసభలలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు నియోజకవర్గంలోని నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద మండలాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అమెరికా పర్యటనలో ఉన్నారు. బీజేపీ రాష్ట్ర సమావేశంలో పాల్గొనేందుకు కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ వెళ్లడంతో ఆయన ప్రజాపాలన సభలలో పాల్గొనలేకపోయారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సైతం స్థానికంగా లేకపోవడంతో కార్యక్రమంలో పాల్గొనలేదు. జెడ్పీ చైర్‌పర్సన్ శోభ కూడా కార్యక్రమంలో పాల్గొనలేదు. బీబీపేట మండలంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. కొన్నిచోట్ల ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరయ్యారు.

**'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి**

**కామారెడ్డి క్రైం:** ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కార్యక్రమ రాష్ట్ర పరిశీలకురాలు, విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి హరిత గురువారం కామారెడ్డికి వచ్చారు. ఆమెతో కలిసి దేవునిపల్లిలో ప్రారంభించిన ప్రత్యేక కౌంటర్‌ను సందర్శించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తులను నింపడంలో గ్రామ కార్యదర్శులు, వార్డు సిబ్బంది సహాయ పడుతున్నారన్నారు. జిల్లాలో 2,93,635 కుటుంబాలు ఉన్నాయని, అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు ఇస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో గ్రామసభ రోజు దరఖాస్తు చేయని వారు జనవరి 6 లోగా సంబంధిత జీపీ కార్యాలయంలో సమర్పించవచ్చని తెలిపారు. అదనపు కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్ పాల్గొన్నారు.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**అమిత్‌షాతో ఎమ్మెల్యేలు..**







హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ రాష్ట్ర స్థాయి సమావేశాలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అమిత్‌షాను సన్మానించారు.

# ఖాతాలో డబ్బులు మాయం

- ఖాతాదారులకు తెలియకుండా డ్రా చేసిన బ్యాంకు సిబ్బంది
- చనిపోయిన వ్యక్తి ఖాతా నుంచి తీసిన వైనం
- లింగంపేట ఐవోబీ ఎదుట ఆందోళన చేసిన ఖాతాదారులు



బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న ఖాతాదారులు

**లింగంపేట:** తమకు తెలియకుండా అకౌంట్‌లో నుంచి డబ్బులు డ్రా చేయడంపై ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం లింగంపేట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ ఆర్యరాజ్‌ను పలువురు ఖాతాదారులు నిలదీశారు. మండలంలోని పొల్కంపేటకు చెందిన తలారి కిష్టయ్య గతంలో రూ.36,000 పంట రుణం తీసుకున్నాడు. 2023 మార్చి 3న కిష్టయ్య తన రుణం వనటైమ్ సెటిల్మెంటు (ఓటీఎస్) ద్వారా చెల్లించారు. దాంతో కిష్టయ్యకు బ్యాంకులో ఎలాంటి అప్పులేదని మేనేజర్ ఎన్‌వోసీ ఇచ్చాడు. 2023 ఆగస్టు 10న కిష్టయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. తన ఖాతాలో రూ.39,091 ఉన్నాయి. కాగా 2023 అక్టోబర్ 12న కిష్టయ్య పేరిట రూ.26,970 పంట రుణం బ్యాంకు అధికారులు డ్రా చేసుకున్నారు. ఈ నెల 26న రూ.4900 మరోసారి డబ్బులు డ్రా చేశారు. కిష్టయ్య కొడుకు సాయిబాబా హైదరాబాదులో ఉంటున్నాడు. తన తండ్రి ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు మెస్సేజ్ రావడంతో బ్యాంకుకు వచ్చి నిలదీశాడు. చనిపోయిన వ్యక్తి ఖాతా నుంచి ఎలా తీస్తారని ప్రశ్నించారు. సాయిబాబాతో పాటు తమ ఖాతాల్లో నుంచి సైతం డబ్బులు తమకు తెలియకుండా లోన్‌ల పేరిట డ్రా చేసుకుంటున్నారని 30 మందికిపైగా బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగారు. ఉదయం తొమ్మిది గంటలకే బ్యాంకుకు చేరుకొని బ్యాంకు తెరవకుండా అడ్డుకున్నారు. రెండు గంటల పాటు ధర్నా చేశారు. ఖాతాదారుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ అక్కడకు చేరుకొని బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులతో మాట్లాడారు. దాంతో ఖాతాదారులు ధర్నా విరమించారు. అనంతరం ప్రజా పాలనలో పాల్గొనడానికి వచ్చిన ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక పంపుతానని ఆయన తెలిపారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ ఆర్యరాజ్‌ను వివరణ కోరగా బ్యాంకు నిబంధనల ప్రకారమే చేశామని సమాధానం దాటవేశారు. స్థానిక నాయకులు నారాగౌడ్, గోపీగౌడ్, సాయిరాం, సాదిక్, ఖయ్యూం, పాష, బాబా, నగేష్ రైతులకు మద్దతు తెలిపారు.

### ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

**సాక్షి, కామారెడ్డి:** అల్ప్రాజోలం రవాణా కేసులో అరెస్టయిన కామారెడ్డికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్ యాదవ్‌ను సస్పెండ్ చేస్తూ ఈ నెల 25న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా ఎక్సైజ్ అధికారి రవీందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నేరాలతో సంబంధం ఉన్న వారిలో సిబ్బంది ఉంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,307 కేసులు నమోదు చేసినట్టు వివరించారు. 7.65 కిలోల అల్ప్రాజోలం, 336 గంజాయి చెట్లు, 85.62 కిలోల ఎండు గంజాయి, 2,124 లీటర్ల గుడుంబా, 1,853 లీటర్ల మద్యం, 273.35 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, 659.35 లీటర్ల బీర్లు, 8068 కిలోల నల్లబెల్లం, 84.41 లీటర్ల దేశీదారు, 92,448.98 లీటర్ల అక్రమ కల్లు, 311 కిలోల పటిక, 35 వాహనాల సీజ్ చేశామని వివరించారు. 46,368 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే నాలుగు మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఆయా కేసులకు సంబంధించి 268 మందిని బైండోవర్ చేశామని పేర్కొన్నారు. బైండోవర్ ఉల్లంఘన కింద మూడు కేసులు చేశామన్నారు. రూ.రెండు లక్షలు జరిమానాలు వసూలు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాల దందా చేసేవారు ఎంతటి వారైనా ఉపేక్షించమన్నారు.

# జిల్లాలో మారిన రాజకీయం

- విభిన్న తీర్పునిచ్చిన జిల్లా ఓటర్లు
- మూడు పార్టీలకు ఆదరణ
- రెండుచోట్ల గెలుపుతో కాంగ్రెస్‌లో జోష్
- ఇద్దరు ఉద్దండులను ఓడించి రికార్డు సృష్టించిన బీజేపీ
- మూడుచోట్ల ఓటమితో డీలాపడ్డ బీఆర్ఎస్
- స్పీకర్ ఓటమి సెంటిమెంటును అధిగమించిన పోచారం

**జిల్లా రాజకీయాల్లో ఈ ఏడాది ఎన్నో సంచలనాలు,** ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఎన్నికల నేపథ్యంలో పలువురు జాతీయ నేతలు జిల్లాలో పర్యటించి, ఆయా పార్టీల శ్రేణుల్లో జోష్ నింపారు. అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసిన ఇద్దరు ఉద్దండులను కాదని కామారెడ్డి ఓటర్లు స్థానిక నేతకు పట్టం కట్టి సంచలన తీర్పు ఇచ్చారు. స్పీకర్‌గా పనిచేసినవారు గెలవలేరన్న సెంటిమెంట్‌ను పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధిగమించారు. 2023 సంవత్సరం బీఆర్ఎస్‌కు చేదు అనుభవాన్ని మిగల్చగా.. కాంగ్రెస్, బీజేపీలలో మాత్రం ఉత్సాహాన్ని నింపింది. – సాక్షి, కామారెడ్డి



కామారెడ్డిలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో బీసీ డిక్లరేషన్ సభలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి



కామారెడ్డిలో బీజేపీ ప్రచార సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు విభిన్న తీర్పునిచ్చారు. కామారెడ్డి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన సీఎం కేసీఆర్, కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ప్రస్తుత చీఫ్ రేవంత్‌రెడ్డిలను కాదని ఓటర్లు స్థానిక నేత బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డిని గెలిపించారు. ఈ తీర్పు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎల్లారెడ్డి, జుక్కల్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులకు పట్టం కట్టిన ఓటర్లు.. బాన్సువాడలో మాత్రం స్పీకర్ ఓడిపోతారన్న సెంటిమెంట్‌కు పాతరేసి బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డినే గెలిపించారు.

**పోచారం గెలుపుతో ఊరట**

బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించడం ద్వారా స్పీకర్లు ఓడిపోతారన్న సెంటిమెంటును తిరగరాశారు. జిల్లాలో మిగిలిన మూడు నియోజకవర్గాలలో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓటమి పాలైనా.. బాన్సువాడలో గెలుపు ఆ పార్టీ శ్రేణులకు ఊరటనిచ్చింది.

**ప్రముఖుల రాకతో సందడి..**

ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు రాష్ట్ర నేతలతో పాటు జాతీయ స్థాయి నేతలూ క్యూ కట్టారు. నవంబర్ 9న నామినేషన్ అనంతరం నిర్వహించిన సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచార బాధ్యతలను తన భుజాలపై వేసుకుని నియోజకవర్గం అంతటా కలియతిరిగారు. 10న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రేవంత్ రెడ్డి నామినేషన్ వేశారు. అనంతరం నిర్వహించిన బీసీ డిక్లరేషన్ సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాల్గొన్నారు. 26న కామారెడ్డిలో నిర్వహించిన సభలో ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా 25న కామారెడ్డిలో నిర్వహించిన సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలూ ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి, జుక్కల్‌లలో ఎగిరిన కాంగ్రెస్ జెండా**

2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ హవాలోనూ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జాజాల సురేందర్ విజయం సాధించారు. తరువాత ఆయన గులాబీ కండువా కప్పుకున్నారు. మొన్నటి ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన సురేందర్‌ను కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు ఓడించారు. జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు లక్ష్మీకాంతారావు, హన్మంత్‌సింధేల మధ్య హోరాహోరీ పోరు సాగింది. 1,154 ఓట్ల తేడాతో లక్ష్మీకాంతారావు గెలిచారు.

**చర్చనీయాంశంగా మారిన కామారెడ్డి పోరు..**

రివైండ్ 2023

అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల ముందే బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. కామారెడ్డినుంచి అప్పటి సీఎం కేసీఆర్ పోటీ చేస్తారని ప్రకటించడంతో రాజకీయ వేడి పెరిగింది. ఆయనపై పోటీకి ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సై అనడంతో రాజకీయం మరింత రసవత్తరంగా మారింది. వారిద్దరినీ ఓడిస్తాని, లేకపోతే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని బీజేపీ నేత వెంకటరమణారెడ్డి సవాల్ విసిరి బరిలోకి దిగడంతో అందరి చూపూ కామారెడ్డిపై కేంద్రీకృతమైంది. కామారెడ్డి ఎన్నికలపై అంతటా చర్చ సాగింది. చివరికి ఇద్దరు ఉద్దండులను ఓడించి వెంకటరమణారెడ్డి చరిత్ర సృష్టించడంతో కామారెడ్డి పేరు దేశవ్యాప్తంగా మారుమోగింది.



నామినేషన్ దాఖలు అనంతరం గంప ఇంటి వద్ద కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న కుటుంబ సభ్యులు

# జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపిక



పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

**కామారెడ్డి అర్బన్:** జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ అండర్–14, 16 ఎంపికలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలు, గ్రామాలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ చూపిన పది మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు రాష్ట్ర పరిశీలకులుగా రాజాగౌడ్ వ్యవహరించారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం జైపాల్‌రెడ్డి, కేపీ అనిల్‌కుమార్ తెలిపారు. ఆయా అంశాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీసీ అధికారి రామేశ్వర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్ వెంకటేశ్వరగౌడ్, నరేష్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, శివాగౌడ్ సంజీవ్, ధర్మా, గౌమతి, అరుణ, దివ్య, ప్రియాంక, సుజాత, శ్రావంతి తదితరులు పాల్గొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు**

కె ఆనంద్, కె రామ్‌చరణ్, కె సౌజన్య, ఎం రితిక, ఎం బాలరామ్, ఎం గణేశ్, పి గౌతమ్, బి వికాస్, ఎ నక్షత్ర, ఎం సురేఖ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

## క్లుప్తంగా

### బ్రిడ్జ్ కోర్సు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐలో రెండేళ్ల ట్రెయినింగ్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు బ్రిడ్జ్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, నిజామాబాద్ ఐటీఐ (బాలుర) ప్రిన్సిపాల్ ఎం.కోటిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ కోర్సులో 60శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కోర్సుకు గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదువుకోవాలని తెలిపారు. శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులను నగరంలోని బాలుర ఐటీఐలో సమర్పించాలని సూచించారు.పూర్తి వివరాలకు 94417 84849 నంబరును సంప్రదించాలన్నారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పల్లికొండ విద్యార్థినులు



భీమ్‌గల్: నెట్ బాల్ అండర్–19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల కు మండలంలోని పల్లికొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. బి.సంజన, ఏ.స్వాతి, పి.శ్రీజ ఎంపికయ్యారు. ఈ నెల 30, 31న వచ్చే నెల 1న నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారు. హెచ్‌ఎం అనురాధ, పీఈటీ రమేశ్‌గౌడ్ విద్యార్థినులను అభినందించారు.

### నేడు తెయూలో సాక దళిత కథావార్షిక గ్రంథావిష్కరణ

తెయూ(డిచ్‌పల్లి): జంబూ సాహితీ, తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'సాక' దళిత కథా వార్షిక 2022 గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ సెమినార్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ గుండెడప్పు కనకయ్య హాజరై గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని, గుడిపల్లి నిరంజన్ సభాధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ సాహిత్య విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కాలేజ్ తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు హాజరవుతారని పీఆర్వో పున్నయ్య తెలిపారు.

### జాతీయస్థాయి క్రికెట్ టోర్నీకి బెజుగం శ్రీజ ఎంపిక



బెజుగం శ్రీజ

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి క్రికెట్ టోర్నీ ఎడపల్లికి చెందిన బెజుగం శ్రీజ ఎంపికైంది. జనవరిలో కేరళలో జరిగే పోటీల్లో రాష్ట్ర జట్టు నుంచి వికెట్ కీపర్‌గా ఎంపిక అయ్యింది. శ్రీజను పీఆర్‌టీయూ ఎడపల్లి మండలాధ్యక్షుడు పసుల అభిమాన్యు అభినందించారు.

### వ్యాపారిపై కేసు నమోదు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో తూకంలో మోసం చేసిన ఓ ఐరన్ రింగ్స్ వ్యాపారిపై జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులు కేసు నమోదు చేశారు. భవన నిర్మాణాల్లో వినియోగించే ఇనుప రింగుల తయారు చేసి విక్రయాలు చేసే క్రమంలో తూకంలో భారీగా మోసం చేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో గురువారం లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి నిర్మల్‌కుమార్ దాడులు నిర్వహించి విచారణ చేపట్టారు. తూకంలో మోసం చేసినట్లు నిర్ధారణ కావడంతో సదరు వ్యాపారిపై కేసు నమోదు చేశామని అధికారి తెలిపారు.

# న్యూఇయర్ వేడుకలపై ఆంక్షలు

- మైనర్లకు బైక్‌లు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు
- అదనపు డీసీపీ జయరాం



ఖలీల్‌వాడి : కొత్త సంవత్సర వేడుకలపై పోలీసుల నిబంధనలు తప్పకుండా పాటించాలని అదనపు డీసీపీ జయరాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మత్తులో రోడ్లపై తిరిగితే ప్రమాదాలకు గురవుతారని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా పోలీస్ అనుమతి లేకుండా న్యూ ఇయర్ కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఫామ్‌హౌస్, క్లబ్స్, గ్రేటెడ్ కమ్యూనిటీలో అనుమతి లేకుండా నూతన సంవత్సర కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. వాటిని కూడా పరిమితి మించకుండా సౌండ్ వాడరాదన్నారు. క్రాకర్స్, ఆర్కెస్ట్రా, సౌండ్‌స్టిమ్ లేదా అత్యధిక మోతాదులో ఉన్న సౌండ్ సిస్టమ్ (డీజే) ఏర్పాట్లు నిషేధించినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ పరిధిల్లో సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపడ్తామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ సందర్భంగా ఫొటోగ్రాఫీ, వీడియోగ్రఫీలు తీసిన తర్వాత వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

**పెండింగ్ చలాన్లు చెల్లించాలి..**

జీవో నం. 659, ఈనెల 26 నుంచి పెండింగ్ వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను చెల్లించి, రాయితీ పొందాలని డీసీపీ జయరాం తెలిపారు. కోవిడ్ సమయం, తర్వాత విధించిన వారి వాహనాలపై పెండింగ్ చలాన్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. టూ, త్రీ వీలర్స్‌కు 80 శాతం, బస్సులకు 90 శాతం, ఫోర్ వీలర్స్‌కు 60 శాతం రాయితీ ఉందన్నారు.

**నిబంధనలివి..**

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నిషేధమని అదనపు డీసీపీ జయరాం పేర్కొన్నారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వొదన్నారు. పట్టుబడితే మైనర్ తోపాటు వాహనం యాజమానిపై కేసులు నమోదు చేస్తామన్నారు.ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లను తీసివేసి నడిపితే వాహనాలు సీజ్ చేస్తామన్నారు.

## ప్రజల చెంతకు ప్రభుత్వ ప్రజాపాలన

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల చెంతకు ప్రజాపాలనను తీసుకువచ్చారని, అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రం, బంజపల్లిలో అభయహస్తం, ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ, గ్రామసభకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలను అర్హులకు అందించాల్సిన బాధ్యత ఆయా శాఖల ప్రభుత్వ ఆధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్, ఎంపీడీవో నాగేశ్వర్, తదితరులున్నారు.

**కాంగ్రెస్‌లో పలువురి చేరిక**

నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులైన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలో గున్కుల్ సొసైటీ వైస్ చైర్మన్ గొట్టం నర్సింలు ఆధ్వర్యంలో నర్వ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, బాల్‌సాయిలు, తదితరులున్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం తెలంగాణ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల యూనియన్ 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీయస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు రూప్‌సింగ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో తెలిపిన విధంగా పాత పెన్షన్ అమలు అయ్యేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. సీపీయస్ ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి రమేష్, డాక్టర్ శివకుమార్, సభ్యులు రామకృష్ణ, ప్రదీప్ రెడ్డి, నాగభూషణం, మల్లయ్య, బలరాం, ప్రసన్న కుమార్, పీఆర్‌టీయూ సంఘం మండల అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి పి. బన్సీలాల్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను చితకబాదిన పాఠశాల ప్రిన్సిపాల్

- పోలీసులు, డీఈవోకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

ఆర్మూర్: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ అకారణంగా ఇద్దరు పదో తరగతి విద్యార్థులను చితకబాదాడని ఆరోపిస్తూ తల్లిదండ్రులు ఆర్మూర్ పోలీస్ స్టేషన్, ఎంఈవో రాజగంగారాం, డీఈవో దుర్గాప్రసాద్‌కు గురువారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాఠశాలపై అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఎవరో పగులగొడితే అందుకు కారణం ఎవరని నిజనిర్ధారణ చేసుకోకుండా ఆ నేరాన్ని తమ పిల్లలపై వేసి పలుమార్లు చితకబాదడంతో పాటు మధ్యాహ్నం భోజనం చేయకుండా అడ్డుకున్నాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తలలను గోడకేసి బాదడంతో పాటు దుర్భాషలాడినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా తమ పిల్లలకు టీసీ ఇచ్చి పంపించి వేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

## మహాలక్ష్మి సాయానికి అర్హులెవరు?

- అర్హుల ఎంపికకు మార్గదర్శకాలు ఇవ్వని ప్రభుత్వం
- ఆసరా లబ్ధిదారులు, చిరుద్యోగులకు ఇస్తారా లేదా అనే సందేహం




మోర్తాడ్(బాల్కొండ): తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలనెలా రూ.2,500ల చొప్పున ఆర్థికసాయాన్ని మహాలక్ష్మి పథకం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆ పార్టీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మహాలక్ష్మి పథకం సాయం పొందే మహిళల వయస్సు 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉండాలనే నిబంధన తప్ప మరే ఇతర విధివిధానాలను ప్రకటించలేదు. లబ్ధిదారులను ఎంపిక చేయడానికి అవసరమైన మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో అర్హులు ఎవరు, అనర్హులు ఎందరో అనే విషయం తేలక గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆసరా పథకం కింద వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, బీడీ కార్మికులు పింఛన్లు పొందుతున్నారు. అలాగే ఆశవర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తల లాంటి చిరుద్యోగులున్నారు. ఇలాంటి వారికి సాయం అందిస్తారా లేదో తేల్చాల్సి ఉంది. అలాగే సాయంకు ఎంపికయ్యే మహిళల కుటుంబాల ఆదాయంను పరిగణలోకి తీసుకుంటారా లేదా అనేది కూడా తేలాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటికే ఆసరా పథకం కింద 77,158 వితంతువులు, 10,520 మంది ఒంటరి మహిళలు, 96,264 మంది బీడీ కార్మికులు పింఛన్లు పొందుతున్నారు.

## సేవల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- జాతీయ ప్రమాణాల కమిటీ సభ్యుడు డాక్టర్ పావెంత్



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రోగులకు ఉత్తమ వైద్య సేవ లు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు డాక్టర్ పావెంత్ అన్నారు. రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో కమిటీ సభ్యుల తనిఖీలు గురువారం రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా డాక్టర్ పావెంత్, రోనాక్ శర్మ ఆస్పత్రి పరిసరాలు, రికార్డులను పరిశీలించి, ఆస్పత్రిలో అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పలు విభాగాలకు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాల శాతం పెంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీపీవో పద్మజ, ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, వైద్య సిబ్బంది శ్రీధర్ ఉన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్న రాబిన్ సింగ్



కామారెడ్డిలో రాబిన్ సింగ్

కామారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సైకిల్ యాత్ర చేపట్టిన రాబిన్ సింగ్ అన్నారు.పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా చేపడుతున్న ఆయన సైకిల్ యాత్ర గురువారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ఆ యన అవగాహన కల్పించారు.ఇప్పటి వరకు 2,648 కిలో మీటర్లు సైకిల్ యాత్ర చేపట్టినట్లు చెప్పారు.

## పంటల పరిశీలన



డోంగ్లీ శివారులో పంటను పరిశీలిస్తున్న ఏవో

మద్నూర్: మినుము పంటకు బూడిద, తుప్పు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, రైతులు రక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రాజు సూచించారు. డోంగ్లీ శివారులో గురువారం మినుము పంటను ఆయన పరిశీలించారు. మినుము పంటలో బూడిద, తుప్పు తెగుళ్లను గమనించామని రైతులు సకాలంలో నివారణ మందును స్ప్రే చేయాలని సూచించారు. వీటి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా తయోపానెట్ మిథైల్ ఒక గ్రాము లేదా మైకోబుటనిల్ 0.5 గ్రాము లేదా డిఫెన్ కొనజోల్ ఒక మిల్లీ మందును లీటర్ నీటిలో కలుపుకోని 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయలన్నారు.

## యూనియన్ బ్యాంక్‌ను తనిఖీ చేసిన ఏజీఎం

సాక్షి ఎఫెక్ట్..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ యూనియన్ బ్యాంక్‌లో జరుగుతున్న అక్రమాల తీరుపై 'సాక్షి'లో వరుసగా కథనాలు ప్రచురితమవడంతో బ్యాంకు అధికారులు స్పందించారు. ఏజీఎం, పీఎంఈజీపీ రికవరీ అధికారులు గురువారం బ్యాంక్‌ను సందర్శించారు. చనిపోయిన వారికి రుణాలు ఇస్తున్నారని, బ్యాంక్‌లో కమీషన్ ఏజెంట్ల నిర్వాకం, ఏజెంట్లు చెప్పిన వారికే రుణాలు ఇస్తున్నారనే విషయాన్ని 'ఆత్మకు పంట రుణం', 'కమీషన్ ఏజంట్లదే హవా' 'ఏజెంట్లు చెబితేనే రుణాలు' అనే శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనాలకు అధికారులు స్పందించి బ్యాంక్ సీసీ ఫుటేజీలు పరిశీలిచారు. ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న వారి ఖా తాలను, పీఎంఈజీపీ రుణాల పంపిణీ తీరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నివేదికను తయారు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామ ని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ భవనేశ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలిగించొద్దు



గాంధారిలో ఎంపీడీవో సతీష్‌కు సూచనలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



బాన్సువాడలో ..



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

ఎల్లారెడ్డి/బాన్సువాడ/సదాశివనగర్/లింగంపేట/బిచ్కుంద/గాంధారి: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోడానికి వచ్చిన ప్రజలకు ఇబ్బందులు కల్గించొద్దని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. గురువారం ఆయన ఎల్లారెడ్డి, బాన్సువాడ, సదాశివనగర్, లింగంపేట, బిచ్కుంద, గాంధారిలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. దరఖాస్తులు నింపడానికి ప్రజలకు సాయం చేయాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకుంటే జిరాక్సు ద్వారా కూడా చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి మేలు జరుగుతుందన్నారు. సందేహాలు ఉన్నవారికి నివృతి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఎక్కువ సంఖ్యలో వస్తే అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ధరణిలో భూమి చూపడం లేదని, ఇతర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు, మహిళలు కలెక్టర్‌కు తమ సమస్యలు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే అందరి సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ రమేష్, సదాశివనగర్ తహసీల్దార్ హిమబిందు, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, లింగంపేట తహసీల్దార్ ప్రభాకర్, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, బిచ్కుంద డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**కార్డన్ సెర్చ్‌లో సీఐ తిరుపయ్య**



కంచర్లలో మాట్లాడుతున్న సీఐ తిరుపయ్య

భిక్కనూరు: ప్రజలు ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు సీఐ తిరుపయ్య అన్నారు. గురువారం రాత్రి భిక్కనూరు మండలం కంచర్లలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 53 వాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేవని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి పాన్, ఆధార్ నంబర్లు, ఓటీపీ, బ్యాంక్ ఖాతా నంబర్లు చెప్పవద్దన్నారు. ఆన్‌లైన్ మోసగాళ్లు రోజుకో విధంగా ప్రజలను మోసం చేస్తున్నారని జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాహనాలకు తప్పనిసరిగా బీమా సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. రోడ్డు నిబంధనలను పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగవన్నారు. కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## క్రైం కార్నర్

### వృద్ధుడి అదృశ్యం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్‌కు చెందిన పసూల శివయ్య అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శివయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 26న మధ్యాహ్నం 3 గంటల సమయంలో గేదెల షెడ్డు వైపు వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పక్కల ప్రదేశాలు, బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫోన్‌నంబర్ కూడా స్విచ్‌ఆఫ్ వస్తుంది. వృద్ధుడి కుమారుడు సంజీవ్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### ఇరువురి మధ్య ఘర్షణ

■ ఎంపీ చొరవతో ఒకరిపై కేసు నమోదు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలో ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ జరగడంతో ఒకరిపై కేసు నమోదైంది. మండల కేంద్రానికి చెందిన కస్తూరి గంగాధర్ అనే యువకుడు బైక్‌పై ఆర్మూర్ బైపాస్ రోడ్ మీదుగా నందిపేటలోని తన షాపునకు వస్తుండగా.. ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇర్ఫాన్ అనే యువకుడు అదుపుతప్పి పడిపోయాడు. ఈ విషయమై ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో గంగాధర్ అనే యువకుడు ఆర్మూర్ ఎమ్మెల్యే, నిజామాబాద్ ఎంపీలకు ఫోన్‌చేసి ఇర్ఫాన్ అనే వ్యక్తి తనను అకారణంగా కొట్టాడని తెలిపాడు. ఈ విషయంలో ఎంపీ అర్వింద్ ఆర్మూర్ ఏసీపీకి ఫోన్‌చేసి అకారణంగా కొట్టిన వ్యక్తిపై కేసునమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏసీపీ ఆదేశాల మేరకు ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి బాధితుడు గంగాధర్ ఫిర్యాదు చేయడంతో ఇర్ఫాన్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

## హత్యకేసులో లొంగిపోయిన నిందితులు



బాన్సువాడ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎదుట లొంగిపోయిన నిందితులు

బాన్సువాడ రూరల్: కుటుంబ కలహాలతో కన్నతండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడు అంజాగౌడ్, అతని తల్లి సరోజన గురువారం బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి సమక్షంలో పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. బాన్సువాడ మండలంలోని మొగులాన్ పల్లిలో తరచూ కుటుంబ కలహాల కారణంగా ఈనెల 24న రాత్రి తండ్రి రామాగౌడ్‌ను తల్లి సరోజన సహాయంతో అంజాగౌడ్ బండరాయితో మోది హత్య చేశాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన మిత్రుడు సాయిబాబా సహాయంతో ద్విచక్రవాహనంపై మృతదేహాన్ని చీరలో చుట్టుకుని బుడిమి గ్రామ చెరువులో పారేశారు. ఏమి తెలియనట్టు నటించి, హత్యకేసు నుంచి బయటపడాలని చేసిన ప్రయత్నం విఫలం కావడంతో గురువారం గ్రామ, కులపెద్దల ఎదుట నేరం ఒప్పుకున్నారు. దీంతో నిందితులను గ్రామపెద్దలు స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు.

### కాలూరులో పేకాట స్థావరంపై దాడి

- ఆరుగురిపై కేసు నమోదు

నిజామాబాద్ రూరల్: మండలంలోని కాలూర్ శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజ్ ఆధ్వర్యంలో సీఐ అజయ్ బాబు, సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేసినట్లు వివరించారు. పేకాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై మహేశ్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 29,450 సీజ్ చేశారు. ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

### అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీ సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మొరం టిప్పర్లు

వర్ని: మండలంలోని హమ్నాపూర్, ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీ, నాలుగు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ వెల్లడించారు. అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వి తరలిస్తుండగా గురువారం పట్టుకున్నట్లు తెలిపారు.

## నిజామాబాద్‌లో బాలికల ఆచూకీ లభ్యం

- సెల్‌ఫోన్ చూడడంతో తల్లిదండ్రుల మందలింపు
- ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన వారికోసం ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలికలు
- నలుగురు బాలికలు ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థినులు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): తరచూ సెల్‌ఫోన్ చూస్తున్న నలుగురు బాలికలను తల్లిదండ్రులు మందలించడంతో ఆదిలాబాద్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయి వచ్చిన బాలికల ఆచూకీ నిజామాబాద్‌లో లభ్యమైంది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ధోబీ కాలనీకి చెందిన నలుగురు బాలికలు సరస్వతినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. అయితే బాలికలు తరచూ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రాం చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. బుధవారం స్కూల్‌కు వెళ్లిన బాలికలు సాయంత్రం 6 గంటలు అయినా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు మావల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు స్కూల్‌కు వెళ్లిన నలుగురు బాలికలు మధ్యాహ్నం ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి అక్కడి నుంచి ఆదిలాబాద్ బస్టాండ్‌కు చేరుకొని నిజామాబాద్ బస్సు ఎక్కినట్లు సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించారు. అలాగే తల్లిదండ్రుల సెల్‌ఫోన్లలో ఇన్‌స్టాగ్రాంలో వాయిస్ ఆధారంగా నిజామాబాద్ వచ్చినట్లు గుర్తించి ఇక్కడి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నిజామాబాద్ పోలీసులు అర్ధరాత్రి బస్టాండ్‌కు చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. మావల పోలీసులకు బాలికలను గురువారం అప్పగించారు. వీరు ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైన వారి కోసం నిజామాబాద్‌కు వచ్చినట్లు సమాచారం.